జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com

www.jatheeyavaartha.com

# జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక



చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761



epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com



బుధవారం | 25-6-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 378 పేజీలు: 4 వెల : రూ.7





## త్వరలో మరో 46 మందికి..

# చిట్టా రెడీ!




*** సిద్ధమైన రెండో జాబితా * ఈసారి జిల్లా పోలీసు కార్యాలయం నుంచే అధికమంది * ఎవరెవరు ఉంటారోనని కొందరిలో గుబులు * బదిలీ అయిన వారంతా ఆయా స్టేషన్లలో విధుల్లోకి * రికమండేషన్లు పనిచేయక పోవడంతో తలలు పట్టుకుంటున్న కొందరు**

శ్రీకాకుళం క్రైం, జూన్ 24 (వార్త):జిల్లా పోలీసు శాఖలో అనేక ఏళ్ల నుంచి పాతుకుపోయిన వారిని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి బదిలీ చేసిన సంగతి తెలిసిందే. బదిలీ అయిన వారంతా మంగళవారం సాయంత్రంలోగా ఆయా స్టేషన్లలో విధుల్లో చేరాలని, అక్కడి నుంచి వారు జాయిన్ అయినట్టు రిపోర్టును జిల్లా పోలీసు కార్యాలయానికి పంపించాలని ఆదేశాలు కూడా ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో బదిలీ అయిన వారంతా ఆయా స్టేషన్లలో విధుల్లో చేరారు. బదిలీ అయిన వారితో ఎస్పీ ముఖాముఖి మాట్లాడి వారికి ఆయా స్టేషన్లకు బదిలీ చేశారు. మొదటి విడతగా 18 మంది ఏఎస్ఐలు, 63 మంది హెచ్‌సీలు, 139 మంది కానిస్టేబుళ్ల బదిలీ అయింది. అయితే మరికొంతమంది ఆయా స్టేషన్లతో పాటు జిల్లా పోలీసు కార్యాలయంలో పాతుకుపోయి ఉన్నారు. వారంతా హమ్మయ్య.. మేం సేఫ్ అనుకున్నారు. మరో విడత బదిలీలు ఉన్నాయంటూ వార్త బయటకు వచ్చింది. 46 మందితో మరో జాబితా సిద్ధంగా ఉందని, త్వరలో వారికి కూడా బదిలీ అవుతుందని జిల్లా పోలీసు కార్యాలయంలోని కొందరు గుసగుసలాడుతున్నారు. ఈ జాబితా ఎస్పీ టేబుల్‌పై ఉందని సమాచారం. ఆ జాబితాలో తమ పేరు ఉందా లేదా అని కొందరు కానిస్టేబుల్ నుంచి హెచ్‌సీ, ఏఎస్ఐ స్థాయి అధికారులు జిల్లా పోలీసు కార్యాలయంలో తమకు తెలిసిన వారిని వాకబు చేసుకుంటున్నారు. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పారదర్శకంగా, తన వద్ద ఉన్న నిక్కచ్చి నివేదికలతో బదిలీలు చేస్తుండడంతో.. దూర ప్రాంతాలకు బదిలీ కాకుండా ఏం చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. పోలాకి, నరసన్నపేట, నందిగాం మండలాలకు చెందిన కొందరు పోలీసులు, హెచ్‌సీలు, ఏఎస్ఐలు అదే పోలీస్‌స్టేషన్లలో ఎన్నో ఏళ్లుగా పాతుకుపోయారు. వారు రికమండేషన్ చేసుకుని మరీ అక్కడ విధులు నిర్వహిస్తున్నారు. ఈసారి అటువంటికి స్థానచలనం జరిగే అవకాశం ఉందన్న వార్త గుప్పుమంటోంది. ఏయే స్టేషన్లలో ఖాళీలు ఉన్నాయన్నది పూర్తిగా నివేదిక తెప్పించుకుని అక్కడి పరిస్థితులను దృష్ట్యా బదిలీలు చేస్తున్నట్టు తెలుస్తోంది. పోలీస్‌స్టేషన్లలో సిబ్బంది కొరతను అధిగమించేలా ఎస్పీ అన్ని చర్యలు చేపడుతున్నారు.

## ధనుపురం పోస్టల్ కార్యాలయంలో

# బీపీఎం చేతివాటం

*** సుమారు రూ.4.20లక్షలు స్వాహా * ఫిర్యాదు చేసిన ఖాతాదారులు *విచారణ చేపడుతున్న పోస్టల్ అధికారులు**

**హిరమండలం/శ్రీకాకుళం క్రైం, జూన్ 24 (వార్త):** హిరమండలం మండలంలోని ధనుపురం సబ్‌పోస్టు ఆఫీసులో అవకతవకలపై సంబంధిత శాఖాధికారులకు గ్రామస్థులు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం టెక్కలి డివిజన్ ఎస్‌పిఐ ప్రతాప్ ఆధ్వర్యంలో అధికారులు ధనుపురం పోస్టాఫీసులో విచారణ చేపట్టారు. ఈ పోస్టాఫీసు పరిధిలోని ధనుపురం, తంప, మాళువ, నౌతల తదితర గ్రామాలకు చెందిన సుమారు 2 వందల మంది ఖాతాదారులు ఉన్నారు. ఖాతాదారులు ఎఫ్‌డీలు, ఆర్డీలు, జనని సురక్ష యోజన తదితర పథకాలకు నగదు జమ చేశారు. అయితే వాటి కాలపరిమితి ముగియడంతో నగదు కోసం వారు రాగా ఈ నిధులను బీపీఎం సొంత అవసరాలకు వినియోగించుకున్నట్టు తెలుసుకున్న ఖాతాదారులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటి వరకు రూ.4.20 లక్షల నగదును బీపీఎం సొంత అవసరాలకు వినియోగించినట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. దీంతో సంబంధిత అధికారులు పోస్టల్ కార్యాలయంలో మొత్తం రికార్డులతో పాటు ఖాతాదారుల ఖాతాలను స్వాధీనం చేసుకుని విచారణ చేపడుతున్నారు. అలాగే ఖాతాదారుల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. నివేదికను జిల్లా తపాలా శాఖాధికారులకు అందజేస్తామని ఎస్‌పీవో ప్రతాప్ వెల్లడించారు.



## దాడి చేయబోగా.. వేలు కొరికేసింది!



**శ్రీకాకుళం క్రైం, జూన్ 24 (వార్త):** శ్రీకాకుళం నగరంలోని రాజ రాజేశ్వరి ఆలయం వెనుక వీధిలో సీహెచ్ తవిటయ్య కుటుంబంతో కలిసి నివాసముంటున్నారు. భార్య, భర్తలు ఇద్దరూ ఉద్యోగాలు చేసుకుంటున్నారు. వారు ఆఫీసుకు వెళ్లడంతో ఇంట్లో తవిటయ్య అత్త అహల్యాబాయి ఒక్కరే ఉంటున్నారు. గత కొద్ది రోజులుగా దీన్ని గమనిస్తున్న ఓ యువకుడు మంగళవారం ఆ ఇంట్లోకి చొరబడ్డాడు. ఆమె ముఖంపై తెల్లటి వస్త్రాన్ని చుట్టి ఊపిరాడకుండా చేశాడు. ఆమె పెనుగులాడే క్రమంలో ఆ యువకుడి బొటన వేలును నోటితో కొరికేసింది.ఆ తర్వాత గట్టిగా కేకలు వేసింది. దీంతో ఆ యువకుడు గోడ దూకి పారిపోయాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన సమాచారంతో రూరల్ సీఐ పైడపునాయుడు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. అగంతకుడు ఏవిధంగా దాడికి పాల్పడ్డాడన్నది వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న సీఐ తెలిపారు.

## మామను చంపిన అల్లుడి అరెస్టు

**ఇచ్ఛాపురం, జూన్ 24 (వార్త):** మామను హత్య చేసిన అల్లుడిని అరెస్టు చేసినట్టు సీఐ ఎం.చిన్నంనాయుడు మంగళవారం మీడియాకు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మండపల్లికి చెందిన బర్రి గంగయ్య(51) గత మంగళవారం హత్యకు గురయ్యారు. ఉదయం సైకిల్‌పై పంచాయతీ సొమ్ము కట్టేందుకు వెళుతుండగా అతని అల్లుడు పాతిర్ల దశరథ రెడ్డి అలియాస్ జీవన్‌రెడ్డి అడ్డగించి కత్తితో పొడిచి పారిపోయాడు. ఆయన భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు అల్లుడిపై హత్య కేసును నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మంగళవారం లొద్దపుట్టి బైపాస్ కూడలి వద్ద దశరథరెడ్డి పట్టుబడ్డాడు. నిందితుడు హత్యకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు.



# 28న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

**శ్రీకాకుళం, జూన్ 24(వార్త):** జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 28వ తేదీ ఉదయం 10.30 గంటలకు జరగనుందని జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణాధికారి ఎల్ ఎన్ వి శ్రీధర్ రాజా ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రజా పరిషత్ నూతన సమావేశ మందిరంలో శనివారం ఉదయం 10:30 గంటలకు ఈ సమావేశాన్ని గౌరవ అధ్యక్షులు అధ్యక్షతన నిర్వహించనున్నట్లు చెప్పారు. సభకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయని, సభ్యులు తప్పనిసరిగా హాజరు కావాలని, సమావేశానికి సంబంధించి సంబంధిత ప్రజాప్రతినిధులు అందరికీ ఎజెండా అంశాలను పంపించినట్లు తెలిపారు.

# ఆదుకుంటాడనుకుంటే.. అనంత లోకాలకు..!

**-డబార్సింగి రిజర్వాయర్ లో పడి**

**గిరిజన విద్యార్థి మృతి**

**-కన్నీరుమున్నీరవుతున్న తల్లిదండ్రులు**

**మందస, జూన్ 24(వార్త):** కాయకష్టం చేసుకుంటూ కుమారుడిని ప్రయోజకుడిని చేస్తే.. వృద్ధాప్యంలో ఆదుకుంటాడని ఆ గిరిజన దంపతులు ఆశించారు. తాము కష్టపడినా.. కొడుకు ఉన్నతస్థాయిలో ఉండాలని భావించారు. దీంతో పేదరికానికి చెందిన ఆ కుటుంబం ఏకైక పుత్రుడిని విద్యావంతునిగా తీర్చిదిద్దడానికి శాయశక్తులా కృషి చేస్తున్నారు. కానీ.. విధి వక్రీకరించింది. ఆదుకుంటాడని ఆశించిన కుమారుడిని అనంతలోకాలకు తీసుకెళ్లిపోయింది. ప్రయోజకుడవుతాడని భావించిన ఆ కుటుంబానికి కుమారుడు శవమై కనిపించడంతో బోరున విలపించారు. వివరాలిలా ఉన్నాయి. మందస మండలంలోని బొగాబంద పంచాయతీ కొంటాసాయి అనే గిరిజన గ్రామానికి చెందిన సవర సుబ్బారావు, రొయిబారి దంపతుల కుమారుడు సవర మంజు(18) డిగ్రీ చదువుతున్నాడు. ఓ వైపు విద్యనభ్యసిస్తునే.. మరో వైపు తల్లిదండ్రులకు తోడుగా పనులు చేస్తున్నాడు. దీనిలో భాగంగా పశువులను డబారిసింగి రిజర్వాయర్ వైపు తోలుకుని వెళ్లి, వాటిని మేపిస్తున్నాడు. సాయంత్రమైనా.. ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులు కూడా వెదకడానికి వెళ్లి చూడగా, రిజర్వాయర్ లో మంజు శవమై కనిపించాడు. ఏం జరిగిందో, ఏమో కానీ.. ఇంటికి వస్తాడనుకున్న కుమారుడు విగతజీవిగా కనిపించడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. స్థానిక గిరిజనులు కన్నీటిపర్యవంతమయ్యారు. కాగా, మంజుకు ఈత



వచ్చుని, రిజర్వాయర్ లో మునిగి మరణించడంపై గిరిజనులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మందస పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



## ట్రిపుల్ ఐటీ ఫలితాలలో సొండిపూడి విద్యార్థుల ప్రతిభ

**మందస, జూన్ 24(వార్త):** ట్రిపుల్ ఐటీ ఫలితాలలో మందస మండలంలోని సొండిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి మొదటి విడతలోనే నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. ప్రతిభ చూపిన విద్యార్థులను జిల్లా విద్యాశాఖ అధికారి తిరుమల చైతన్య స్వయంగా పాఠశాలకు విచ్చేసి ఎంపికైన బాడ శ్రీజ, భాగ్యలక్ష్మి పాణిగ్రాహి, మట్ట హర్ష, డొక్కరి మాధవిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంతటి విజయానికి కారకులైన ప్రధానోపాధ్యాయుడు సుందర్ సాల్మన్‌కు, ఉపాధ్యాయులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఎన్ఎంఎంఎస్‌లో విజేతలైన ఇద్దరు చిన్నారులు జె.నిహారిక, వై.మధుప్రియను కూడా అభినందించారు.

# నరసన్నపేట జీజేసీ విద్యార్థులకు ర్యాంకుల పంట

**-కర్నూలు సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాల ఎంట్రన్స్ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ**

**-ఏపీఆర్డీసీ ఎంట్రన్స్ ఫలితాల్లో సత్తా చాటిన విద్యార్థులు**

**-కర్నూలు సిల్వర్ జూబ్లీకి నలుగురు, నాగార్జున సాగర్ డిగ్రీ కళాశాలకు ముగ్గురు ఎంపిక**

**-విద్యార్థులను, అధ్యాపకులను అభినందించిన ప్రిన్సిపాల్ పవన్**



**నరసన్నపేట, జూన్ 24(వార్త):** ప్రభుత్వ జూనియర్ కళాశాల నరసన్నపేట లో ఇంటర్మీడియట్ పూర్తిచేసిన విద్యార్థులు ఇటీవల జరిగిన ప్రవేశ పరీక్షలలో సత్తా చాటారు. కర్నూలులోని ప్రతిష్టాత్మకమైన సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాలకు రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో మంది విద్యార్థులు పోటీ పడతారు. అంతటి ప్రాముఖ్యత కలిగిన కళాశాలలో డిగ్రీ చేరేందుకు గత నెలలో నిర్వహించిన సిల్వర్ సెట్ 2025 పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు ప్రిన్సిపాల్ పవన్ తెలిపారు. సీఈసీ గ్రూప్ చదివిన కొంకి రాంబాబు 42వ ర్యాంకు రాగా, అకౌంటింగ్ అండ్ ట్యాక్సేషన్ (ఒకేషనల్) గ్రూప్ చదివిన ముగ్గురు విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. వాడవలస రామకృష్ణకు 135వ ర్యాంకు, బోర షర్మిలకు 152వ ర్యాంకు రాగా పీట యమునకు 414వ ర్యాంకు (స్పోర్ట్స్ కోటా) వచ్చాయన్నారు. అలాగే ఇటీవల విడుదలైన ఏపీఆర్డీసీ ఎంట్రన్స్ ఫలితాల్లో అకౌంటింగ్ అండ్ ట్యాక్సేషన్ (ఒకేషనల్) గ్రూపు విద్యార్థులు సత్తా చాటారని తెలిపారు. ఏ అండ్ టీ గ్రూపు చదివిన బుడ్డాల రవీంద్ర, వాడవలస రామకృష్ణ, ఉంగటి లాలూప్రసాద్ లకు నాగార్జున సాగర్ లోని డిగ్రీ కళాశాలలో బీకాం సీట్లు లభించాయనీ తెలిపారు. తమ విద్యార్థులు కర్నూలు సిల్వర్ జూబ్లీకి నలుగురు, నాగార్జున సాగర్ డిగ్రీ కళాశాలకు ముగ్గురు ఎంపిక కావడం పట్ల ప్రిన్సిపాల్ మరపట్ల పవన్ హర్షం వ్యక్తంచేశారు. ఏ అండ్ టీ వృత్తివిద్య అధ్యాపకులు దుగ్గివలస రాంప్రసాద్, కొర్రాయి రవి, జీ.ఎఫ్.సీ. కూన హరిప్రసాద్, స్వర్ణలత, ఆనందరావు విద్యార్థులకు ప్రత్యేక తర్ఫీదు ఇచ్చి ర్యాంకులు సాధించేలా కృషి చేస్తున్నారనీ అభినందించారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులు తమ కళాశాలలో పనిచేస్తున్నారనీ గుర్తు చేశారు. డాక్టర్ మల్లేశు, రూపవతి, సత్యనారాయణ, జోశ్యుల హరిప్రసాద్ సహకారంతో సీఈసీ గ్రూపులో టాపర్ ఐన కొంకి రాంబాబుకి 42వ ర్యాంకు రావడం పట్ల లైబ్రరీ సైన్స్ అధ్యాపకులు జే.వదనగిరి, అధ్యాపకులు విశ్వప్రసాద్, శివరాం ప్రసాద్, నాగకుమారి ఇతర అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

## కార్పొరేషన్ ఆస్తుల.. ప్రైవేటీకరణే అభివృద్ధా?




**శ్రీకాకుళం, జూన్ 24(వార్త):** శ్రీకాకుళంలో కార్పొరేషన్ ఆస్తులను ప్రైవేటీకరణ చేస్తే ప్రజల సహించరని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శి వర్గ సభ్యుడు బి.కృష్ణమూర్తి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ శ్రీకాకుళం నగరంలో చారిత్రక నేపథ్యం ఉన్న మున్సిపల్ కార్పొరేషన్ ఆస్తులతో పాటు పెద్ద మార్కెట్, బాపూజీ కళామందిర్, గాంధీ పార్క్, డైమండ్ పార్కు, కార్గిల్ పార్కు, నాగావళి రివర్ పార్కు, ఎల్బీఎస్ కాలనీ పార్కు, జిల్లా గ్రంథాలయ సంస్థ, పెద్దపాడు చెరువు, విజయాదిత్య పార్కు తదితర విలువైన ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు కారు చౌకగా ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టాలని చూస్తుందని ఆరోపించారు. ఇది సరి కాదని, దీనిపై తాము పోరాడతామని తెలిపారు.

# పలాస మాజీ సర్పంచ్ నీలకంఠ ఆకస్మిక మృతి



**పలాస, జూన్ 24(వార్త):** పలాస మేజర్ పంచాయతీ మాజీ సర్పంచి కొల్లకోట నీలకంఠం (82) అస్వస్థతతో మంగళవారం మృతి చెందారు. నీలకంఠం పలాస మేజర్ పంచాయతీలు సుధీరకాలంగా సర్పంచ్‌గా సేవలందించారు. 20 ఏళ్ల పాటు సర్పంచిగా ఉంటూ, అప్పట్లో గౌతు లచ్చన్న అనుచరుడిగా కొనసాగేవాడు. గౌతు లచ్చన్న మృతి చెందడంతో ఆయన కుమారుడు అప్పటి ఎమ్మెల్యే గౌతు శివాజీకి ప్రధాన అనుచరుడిగా ఉంటూ రాజకీయాల్లో కొనసాగించేవారు. ఈయన మృతి తీరనిలోటని పలాస పట్టణ ప్రజలు బాధను వ్యక్తం చేస్తున్నారు.

**మంచి ఆప్తుడిని కోల్పోయాను: శివాజీ**

నీలకంఠం మరణం అత్యంత బాధాకరమని మాజీ మంత్రి శివాజీ అన్నారు. మంగళవారం ఆయన



నీలకంఠం మరణించిన విషయం తెలుసుకొని వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా నీలకంఠంతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఆయన వెంట ఏపీటపీసీ చైర్మన్ బాబూరావు, లొడగల కామేశ్వరరావు, విఠల్, గురిటి సూర్యనారాయణ,డొక్కరి శంకర్, గోళ్ళ చంద్రరావు, కోరికాన శంకర్, అప్పారావు, నరసింహులు తదితరులు ఉన్నారు.



**నీలకంఠం మృతి తీరని లోటు : బాబా**

పలాస మాజీ సర్పంచ్ కొల్లకోట నీలకంఠం మృతి చెందడం తీరనిలోటని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, సంఘసంస్కర్త దువ్వాడ శ్రీధర్(బాబా) అన్నారు. మంగళవారం నీలకంఠ కుటుంబాన్ని పరామర్శించి, తన ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని దేవుడిని ప్రార్థించారు.

## గ్లోబల్ ఎడ్యుకేషన్ సమ్మిట్‌కి ముగ్గురు ఉపాధ్యాయుల ఎంపిక

**పలాస, జూన్ 24(వార్త):** గ్లోబల్ ఎడ్యుకేషన్ సమ్మిట్‌కి రామకృష్ణాపురంలోని శ్రీ సత్య సాయి విద్య విహార్ పాఠశాల చెందిన ముగ్గురు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. రెండు రోజులపాటు జరిగే గ్లోబల్ ఎడ్యుకేషన్ సుమ్మిట్‌కి హాజరయ్యేందుకు పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయానికిమ సత్యసాయి విద్యావిహార్ రామకృష్ణపురము చైర్మన్ మల్లా రామేశ్వరావు, కెమిస్ట్రీ ఫ్యాకల్టీ లావణ్య, కృష్ణ మంగళవారం పయనమయ్యారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## ఎంఎస్ఎంఈలకు 26న వర్క్‌షాప్

**శ్రీకాకుళం, జూన్ 24(వార్త):** యువతకు స్వయం ఉపాధి అవకాశాలను పరిచయం చేసేందుకు జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 26న ఉదయం 10.30 గంటలకు నరసన్నపేటలోని శ్రీ రామ సత్యనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలోని ఫంక్షన్ హాలులో అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. డీఐసీ, ఏపీఎస్ఎఫ్‌సీ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ వర్క్‌షాప్‌లో పారిశ్రామిక ప్రోత్సాహకాలు, వివిధ పాలసీలు, ప్రభుత్వ పథకాలపై సంపూర్ణ వివరాలు అందించనున్నట్లు జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ప్రారంభించాలనుకునే ఔత్సాహికులకు ఈ వర్క్‌షాప్ ఉపయుక్తంగా ఉంటుందని, కార్యక్రమంలో ఆధార్ కార్డు, పాన్ కార్డు, బ్యాంక్ అకౌంట్ వివరాలతో హాజరైన వారు ఉచితంగా రిజిస్ట్రేషన్ పొందవచ్చుని, ఈ అవకాశాన్ని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు వినియోగించుకోవాలని శ్రీధర్ కోరారు.

# ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం తగదు

**- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**




**శ్రీకాకుళం, జూన్ 24(వార్త):** ప్రజల అభ్యంతరాలను నిర్లక్ష్యం చేసే అధికారులపై కఠిన చర్యలు తప్పవని శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వ పౌర సేవల బాధ్యతను నిబద్ధతతో నెరవేర్చడంలో ప్రతి అధికారి సమర్థవంతంగా పనిచేయాలని స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్) ప్రజా సమస్యల పరిష్కారంపై జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఆయన, జిల్లాలో పలు శాఖల పరిధిలో ఫిర్యాదులు ఇప్పటికీ పెండింగ్‌లో ఉండటంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా రెవెన్యూ శాఖలో సర్వీస్ లెవల్ అగ్రిమెంట్ (ఎస్ ఎల్ ఏ) కాలపరిమితి దాటి పెండింగ్‌లో ఉన్న కేసులపై ఆయన సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఆయా మండలాల నుంచి మండల స్థాయి అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. జిల్లాలో నమోదైన మొత్తం 31,037 ఫిర్యాదుల్లో 1,318 ఫిర్యాదులు ఎస్ఎల్ఏ దాటి పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో 188 కేసులు తిరిగి తెరుచుకున్నాయి. ఈ పెండింగ్ కేసుల్లో ఎక్కువ శాతం రెవెన్యూ, సర్వే, పంచాయతీ శాఖలకు చెందినవే ఉండటం పట్ల ఆయా అధికారులను పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ శాఖలో మొత్తం 33 మండలాల వారీగా 31,037 ఫిర్యాదులు నమోదయ్యాయని, ఇందులో 29,531 ఫిర్యాదులను పరిష్కరించగా, 1,179 ఎస్ఎల్ఏ లోపల, 139 ఎస్ఎల్ఏ దాటి పెండింగ్‌లో ఉన్నాయని మొత్తంగా రెవెన్యూ శాఖలో 5% పెండింగ్ కనిపిస్తున్నదని చెప్పారు. టెక్కలి, గార, నందిగాం, రణస్థలం వంటి గ్రామీణ మండలాల్లో ఎస్ఎల్ఏ దాటి పెండింగ్ కేసులు ఎక్కువగా ఉన్నాయని కలెక్టర్ గుర్తించారు. అలాగే ఆడిట్ ఫిర్యాదుల పరిష్కారంలో ఇప్పటికీ 149 కేసులు పెండింగ్‌లో ఉండటంపై ఆయన సంబంధిత అధికారులను అడిగారు.

**27న రెవెన్యూ సదస్సు:**

పెండింగ్ కేసుల పరిష్కారానికి సమగ్ర ప్రణాళికను రూపొందించేందుకు జూన్ 27న రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు కలెక్టర్ ప్రకటించారు. ఈ సదస్సులో పెండింగ్ కేసుల పరిష్కారానికి ఒక టైమ్ ఫ్రేమ్ను విధించి, తగిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. అన్ని శాఖల అధికారులు తమ ఫిర్యాదులను ఆడిట్‌కు సిద్ధంగా ఉంచాలని, పౌరులలో విశ్వాసం పెంచేలా సమర్థవంతంగా పని చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ప్రజల ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యం ఏ మాత్రం సహించబడదని ఆయన పునరుద్ఘాటించారు. ఈ సమీక్షలో జిల్లా రెవిన్యూ అధికారి ఎం వెంకటేశ్వరరావు, ప్రత్యేక ఉప కలెక్టర్ బి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.




## ట్రిపుల్ ఐటీకి ఆరుగురు బ్రాహ్మణతర్లా విద్యార్థుల ఎంపిక

**పలాస, జూన్ 24(వార్త):** పలాస మండలంలోని బ్రాహ్మణతర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు జి. నిరోషా(నూజివీడు), సీహెచ్. హర్షిత( నూజివీడు), పి. బాలకృష్ణ (నూజివీడు), బి. హేమంత్ (శ్రీకాకుళం), ఎస్. ప్రణీత్ సాయి (ఇడుపల పాయ), ఎస్. ప్రణతి (శ్రీకాకుళం) ట్రిపుల్ ఐటీకి ఎంపిక అయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం నాడు పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వీరిని అభినందించారు. వక్తలు ప్రసంగిస్తూ... వీరిని స్ఫూర్తిగా తీసుకొని వచ్చే విద్యా సంవత్సరంలో మరిన్ని ఎక్కువ మంది ఎంపిక కావాలని, ఈ విద్యార్థులు కూడా ఉన్నత శిఖరాలకు అధిరోహించి పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయులు తారకేశ్వర పండా ఆధ్వర్యంలో జరగగా, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థిని పైల కీర్తనను అభినందించిన డీఈవో



**మందస, జూన్ 24(వార్త):** మందస మండలంలోని కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివి, గత విద్యా సంవత్సరం ఎస్ఎస్సీ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి షైనింగ్ స్టార్ అవార్డును పైల కీర్తన పొందింది. అంతేకాకుండా నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపికైన కీర్తనకు జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య అభినందనలు తెలిపారు. మందస మండలంలో పర్యటనలో భాగంగా కొత్తపల్లి ఉన్నత పాఠశాలను సందర్శించి, కీర్తనను అభినందిస్తూ, పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కీర్తన వివిధ క్విజ్ పోటీలు, ఎన్ఎంఎంఎస్ పరీక్షలలో సత్తా చాటి, పాఠశాలకు గతంలో రూ.2000, నేడు ట్రిపుల్ ఐటీ కి ఎంపికైన సందర్భంగా వెయ్యి రూపాయలు పాఠశాల అభివృద్ధికి వితరణ చేయడం గొప్ప విషయమన్నారు. విద్యార్థినిని అభినందించిన వారిలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.వేణుగోపాలరావు, ఉపాధ్యాయులు ఎస్.గణేశ్వరరావు, జి.భీమారావు, ఎం.లక్ష్మణరావు, జి.జానకమ్మ, బి.పాపమ్మ, ఎ.అప్పారావు, ఎం.దామోదరం, జి.గోపాలకృష్ణ, బి.రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా యూనివర్సల్ బ్రదర్ హుడ్ డే

**శ్రీకాకుళం టౌన్, జూన్ 24 (వార్త):** ప్రపంచమంతటా సోదరత్వ భావనను చాటే ఉద్దేశంతో ప్రతి ఏడాది జూన్ 24న నిర్వహించే విశ్వజన సోదరత్వ దినోత్సవం (యూనివర్సల్ బ్రదర్ హుడ్ డే)ను ఫ్రీమాసన్లు ఘనంగా నిర్వహించారు. స్థానిక శాంతి కన్వెన్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహిం చిన ఈ కార్యక్రమంలో శాంతి, సమరసత భావనలు ప్రతిధ్వనించాయి. ఈ సందర్భంగా ఫ్రీమాసన్లు మాట్లాడుతూ... మానవాళి మధ్య ప్రేమ, ఓర్పు, సహనంతో కూడిన బంధం అవసరమని, భౌగోళిక, మత, భాషా, రాజకీయ భేదాలకు అతీతంగా సమాజం ముందుకు సాగాలన్నదే ఈ దినోత్సవ ఉద్దేశమని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, సామాజిక సేవా కార్యక్రమాలు, పాఠశాల విద్యార్థులకు తోడ్పాటు వంటి అంశాల్లో తాము ముందుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా సాంస్కృతిక కార్యక్రమాలు, స్మృతి ఫలకాలు, క్రీడా బహుమతుల ప్రదానోత్సవం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి ఫ్రీమాసన్లు హాజరై ఈ వేడుకను అంగరంగ వైభవంగా చేశారు. కార్యక్రమంలో వారణాసి నరసింహం, వరద వెంకట గోవిందరాజులు, ప్రళయకావేరి శివకుమార్, కోంకణ్య సుభాష్, బుర్రా ఆదినారాయణ శాస్త్రి, ఐ.కే. రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన డా. కళ్యాణబాబు, కూటికుప్పల సురేష్ కుమార్, మొనంగి రాంజీ తదితరులను సత్కరించారు.




# మహిళల రక్షణే శక్తి టీం లక్ష్యం




**శ్రీకాకుళం, జూన్ 24(వార్త):** సమాజంలో మహిళలపై జరిగే దాడులు అత్యాచారాలు నియంత్రించేందుకు మహిళలకు రక్షణగా శక్తి టీంలు పనిచేస్తున్నాయని ఈ టీం ద్వారా పూర్తిస్థాయిలో మహిళలకు రక్షణ ఇచ్చే యాప్ నీ తీసుకువచ్చామని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు అన్ని ప్రాంతాల్లో ఈ యాప్ పై అవగాహన కల్పించడంలో భాగంగా శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ లో శక్తి టీం వన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యంగా విద్యార్థులకు ఇతర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసిన మహిళలు పూర్తిస్థాయిలో ఈ యాప్ పై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని శక్తి టీం వన్ యూనిట్ తెలిపారు. మహిళలందరికీ పూర్తిస్థాయిలో ఈ యాప్ ని అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా శక్తి టీం పని చేస్తుందని నిరంతరం, మానిటరింగ్ చేస్తూ వారి పరిరక్షణ భాగంగా శక్తి టీం పని చేస్తుందని ఈ అవగాహనతో వారిలో పూర్తిస్థాయి అవగాహన కల్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో విద్యార్థి విద్యార్థులు మహిళలు పాల్గొన్నారు

**నరసన్నపేట** నరసన్నపేటలోని పద్మావతి జూనియర్ కాలేజీ విద్యార్థులకు శక్తి యాప్‌పై టెక్కలి సబ్ డివిజన్ శక్తి టీం వారు మంగళవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# జీడి కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే పోరాటం ఉధృతం




**మందస, జూన్ 24(వార్త):** మందస జీడి కార్మికుల చార్టర్ ఆఫ్ డిమాండ్స్ పరిష్కరించకపోతే పోరాటం ఉధృతం చేస్తామని వక్తలు అన్నారు. జీడి కార్మికుల చార్ట్ ఆఫ్ డిమాండ్స్ పరిష్కరించాలని కోరుతూ జీడి కార్మికులు నిర్వహించిన ర్యాలీకి సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.మోహన్‌రావు సంఘీభావాన్ని తెలిపారు. సీఐటీయు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ జీడి కార్మికులు అతి తక్కువ వేతనాలతో దుర్భరమైన జీవితాలు అనుభవిస్తున్నారని, యాజమాన్యాలు కార్మిక చట్టాలు తుంగలో తొక్కి తీవ్ర దోపిడీ చేస్తున్నాయని ఆరోపించారు. 18 నెలల గడిచినప్పటికీ యాజమాన్యాలు చార్టర్ ఆఫ్ డిమాండ్స్ పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నయన్నారు. మరొక వైపు యాజమాన్యాలు అక్రమంగా వేరే ప్రాంతాల్లో కాల్పులు జరిపించి, చట్ట వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారన్నారు. గత 30 సంవత్సరాల నుంచి పనిచేస్తున్న కార్మికులకు పని ఇవ్వకుండా అక్రమ పద్ధతిలో వేరే ప్రాంతాలకు తరలించడం చట్ట వ్యతిరేకమైందని, దీనిపై ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వం అండతో యాజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయన్నారు. జీడి కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని, పీఎఫ్ ఈఎస్ఐ అమలు చేయాలని, వారాంతపు సెలవులు ఇవ్వాలని, కార్మిక చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక చట్టాలు ఉల్లంఘిస్తున్న యాజమాన్యాలపై కార్మికశాఖ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. సమస్యలు పరిష్కరించకపోతే దశలవారి పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రజల మద్దతుతో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి కె.కేశవరావు, జీడి సంఘం నాయకులు సీహెచ్ చంద్రమ్మ, సీహెచ్ జాన కమ్మ, కె.శాంతమ్మ, గోపమ్మ, సరస్వతమ్మ, దానమ్మ, హేమలత, కళ, దమయంతి, రైస్ మిల్లు సంఘం నాయకులు బాలకృష్ణ, ఏకాసి, కుర్మారావు, దుర్యోధన, కృష్ణారావు, ధర్మరావు, లచ్చయ్య, పోలయ్య, లోకేసు, బి.లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## ఆర్థికశక్తి గా ఎదిగిన భారత్

**ఇచ్ఛాపురం, జూన్ 24(వార్త):** ప్రపంచంలో భారత్ బలమైన ఆర్థికశక్తిగా ఎదిగిందని బీజేపీ జిల్లా ట్రేడ్ సెల్ కన్వీనర్ జి.సాయికామేష్ అన్నారు. స్థానిక రాజా లాడ్జిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో గణనీయమైన పెరుగుదల జరిగిందన్నారు. ఏఐ టెక్నాలజీతో ఉపాధి కల్పన లభిస్తుందన్నారు. కార్యక్రమంలో సాలీనా ఢిల్లీ, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.



# జూలై 5న జాతీయ లోక్ అదాలత్

**-జిల్లా జడ్జి జూనైద్ అహ్మద్ మౌలానా**

**-బహుళ కేసుల రాజీ పై సమీక్ష**

**శ్రీకాకుళం, జూన్ 24(వార్త):** రానున్న జూలై 5న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో పెద్ద సంఖ్యలో కేసులు రాజీ ద్వారా పరిష్కరించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జూనైద్ అహ్మద్ మౌలానా సూచించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు స్థానిక జిల్లా కోర్టు భవనంలో పోలీస్ శాఖ, ఎక్సైజ్, బీమా కంపెనీలు, చిట్‌ఫండ్ సంస్థల ప్రతినిధులు, న్యాయవాదులతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సమీక్షా సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ... గతంలో వచ్చిన అనుభవాల్ని బట్టి ఈసారి మరిన్ని కేసులు ప్రత్యేకించి పోలీస్ శాఖ నుండి అందాలని, ప్రజలకు తక్కువ సమయంలో న్యాయం అందేలా చూడాలన్నారు.




ఈ సమావేశంలో మొదటి అదనపు జిల్లా జడ్జి పి. భాస్కరరావు, మూడవ అదనపు జిల్లా జడ్జి వివేక్ ఆనంద్ శ్రీనివాస్, నాలుగవ అదనపు జిల్లా జడ్జి ఎస్.ఎం. ఫణికుమార్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం. శ్రీధర్ (ఎఫ్ఎసి కార్యదర్శి, న్యాయ సేవాధికార సంస్థ), ఎస్‌డిపిఓ కె.వి. రమణ, అడిషనల్ ఎస్పీ, పలువురు పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## మందస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల ఘనత

**మందస, జూన్ 24(వార్త):** మందసలోని శ్రీ రాజా శ్రీనివాస స్మారక జిల్లా పరిషత్ ఉన్నత పాతశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. 2024-25 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పరీక్షలలో ఇద్దరు విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారు. విద్యార్థులు ఆంగ్ల మాధ్యమం నుంచి ఎం.గిరిబాబు(576), ఒడియా మాధ్యమం నుంచి సంజనాబెహరా(588) మార్కులు పొందారు. వీరిద్దరూ ట్రిపుల్ ఐటీకు ఎంపికయ్యారు. విషయం తెలుసుకున్న జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య విద్యార్థులను అభినందించారు. పాఠశాల పర్యవేక్షణకు వచ్చిన డీఈఓ తిరుమల చైతన్య విద్యార్థులను అభినందించి, విద్యార్థులు పోటీతత్వంతో చదవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎం.లక్ష్మణరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.శ్రీనివాసరావు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది కూడా ఐఐఐటీ సాధించిన విద్యార్థులు ఎం.గిరిబాబు, సంజనాబెహరాలను అభినందించారు.

# వంశధార సాగునీరును సాధిద్దాం



**మందస, జూన్ 24(వార్త):** వంశధార సాగునీరు సాధిద్దామని పలువురు వక్తలు అన్నారు. వంశధార సాగునీరు సాధన కమిటీ ఆధ్వర్యంలో నాయకులు గ్రామాల పర్యటన చేస్తున్నారు. రైతులతో సమావేశమవుతూ.. సమస్యలను వివరిస్తున్నారు. దీంతో రైతులు వంశధార సాగునీటి జలాలు సాధించడానికి రైతులు సిద్ధపడుతున్నారు. తాళభద్ర రైతులతో వంశధార సాగునీరు సాధనకమిటీ సమావేశం జరిగింది. భిన్నల జగన్నాథరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే బెందాళం అశోక్ కుమార్ అదే పనిలో ఉన్నారని, మీరు మేము అందరం కలిసి వంశధార కాలువ సాధించుకోవడానికి కృషి చేద్దామన్నారు. ఉగ్రపిల్లి కృష్ణారావు మాట్లాడుతూ వంశధార కాలువ ద్వారా రైతంగానికి సాగు నీరు అందించాలని వారు సహాయ సహకారాలు పూర్తిగా వంశధార సాగునీరు సాధన కమిటీకి అందిస్తామని చెప్పారు. రైతులు యావన్మంది వంశధార నీరు వస్తే ఒక పంట మాకు గ్యారెంటీగా పండుతుందని రైతులు తెలియజేశారు. అధ్యక్షుడు మార్పు మన్మధరావు, ఉపాధ్యక్షుడు ధర్మార్పు వెంకట్రావు, కొర్ల హేమారావుచౌదరి, నల్ల హడ్డి, వాయలపల్లి మాధవరావు, దుంపల వైకుంఠరావు, ఉగ్రపల్లి సోమనాథం, దేవాడ నారాయణరావు, కొవ్వూరు దశరధి రైతులు పాల్గొన్నారు.

## ఆర్మీ ఉద్యోగికి సన్మానం



**ఇచ్ఛాపురం, జూన్ 24(వార్త):** మశాఖపురం గ్రామానికి చెందిన ఆశి సంతోష్ కుమార్ రెడ్డి ఆశి లక్ష్మీనారాయణ రెడ్డి మేనక ల కుమారుడు . ఈ నెల 16 తేదీన ఆర్మీ లో లెఫ్టినెంట్ ఆఫీసర్ గా నియమితులయ్యారు. మంగళవారం తన స్వగ్రామం మశాఖపురం లో ఇచ్చాపురం జనసేన నాయకులు మరియు రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి రాజు , రాష్ట్ర జాయింట్ సెక్రటరీ తిప్పన దూర్యోధన రెడ్డి , అభినందనలు చెప్పి ఘనం సన్మానం చేశారు .మరియు గ్రామ జనసేన కార్యకర్తలు. సంతోష్ కుమార్ .తారక్,ప్రతాప్, కాళి,కృష్ణమూర్తి.కిరణ్ .ప్రభాకర్.ప్రేమ్,జగదీష్. మరియు గ్రామస్తులు కార్యక్రమం లో పాల్గొన్నారు.

## అనథరైజ్డ్ లే అవుట్ స్థలాలను కొనొద్దు

**-మున్సిపల్ కమిషనర్ రామారావు**

**పలాస, జూన్ 24 (వార్త):** అనథరైజ్ట్ లే అవుట్ స్థలాలను కొనుగోలు చేయవద్దని మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు అన్నారు. పలాస కాశీబుగ్గ జంట పట్టణాలలో మంగళవారం పారిశుధ్య పరిస్థితిని తనిఖీ చేసిన కమిషనర్, పలాస, కాశీబుగ్గ జంట పట్టణాలో పలు ప్రాంతాలను కేటీ రోడ్డు, పాత జాతీయ రోడ్డు 5, అన్న క్యాంటీన్ రోడ్డు, అక్కుపల్లి రోడ్డు జంక్షన్, మొగిలిపాడు, పెసరపాడు తదితర ప్రాంతాలలో పర్యటించి, శానిటేషను ను పరిశీలించి, మెరుగైన శానిటేషను కొరకు సిబ్బంది కి తగు సూచనలు ఇచ్చారు. బిల్డింగ్ కట్టడా లపై, లే అవుట్ల పై వచ్చిన ఫిర్యాదుల పైనా, ఆయా బిల్డింగ్ లను, లే అవుట్లను స్వయంగా సందర్శించి వివరాలను అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ జంట పట్టణాలలో ఇప్పటికే ప్రభుత్వం అనాధ రైజుడు లే అవుట్లుగా ప్రకటించి న ప్రాంతాలలో స్థలాలను కొనుగోలు చేయవద్దని, కొనుగోలు చేసేముందు పూర్తి వివరాలు తెలుసు కోవాలని విజ్ఞప్తి చేశారు. నిర్మాణం లో ఉన్న బిల్డింగ్ లకు ప్రభుత్వ నిభందనలు మేరకు మునిసిపల్ యాక్ట్ ప్రకారం అన్ని అనుమతులు తీసుకొన కుండా నిర్మాణాలను కొనసాగించ వద్దని కోరారు. ఈ నిర్మాణాలకు సంబందించిన పలు కేసులు న్యాయ స్థానము లలో పెండింగు లో ఉన్నందున ఆ కేసులను త్వరిత గతిన పరిష్కరించు కోవాలని కోరారు. ఇదిలా ఉండగా ఈ పురపాలక సంఘంలో ఆనుకొని ఉన్న గ్రామాలు అనగా పెసరపాడు తదితర ప్రాంతాలలో రోడ్లకు ఇరువైపులా మొక్కలు పెరగడంపై ద్రుష్టి సారించి వాటిని క్లియర్ చేయించవలసిందిగా శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు.



# ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన





**భామిని, జూన్ 24 (వార్త):** భామిని మండలం ఘనసారా గ్రామంలో జేమ్స్ వారిచే ఘనసర జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మడపాన అనీల్ కుమార్ ఆధ్వర్యంలో భారీ ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం ప్రతి ఒక్కరికి ఉచితంగా మందులు అందజేశారు అదేవిధంగా గ్రామంలో ప్రతి ఒక్క సేవా కార్యక్రమంలో అనిల్ కుమార్ ముందుండి నడిపిస్తారని అహర్నిశలు ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలు ఎన్నో చేస్తూ ఉంటారని స్థానిక ప్రజలు ఆనందాన్ని వ్యక్తపరిచారు ఈ కార్యక్రమంలో డాక్టర్ అఖిల్ జనరల్ మెడిసిన్




డాక్టర్ ఆకాష్ ఆర్థోపెడిక్ ఆప్తో మొలాజీ అప్పలకొండ, డాక్టర్లు పాల్గొన్నారు

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546